# శారద కథ

ఈ కథ కొంతవరకు బుర్రకథను పోలివుంటుంది. శారద వాద్యము తంబుర వాద్యం వలె వున్ననూ ఆ వాద్యంకన్నా చిన్నదిగా ఉండును. వాద్యమునకు చివరన సరస్వతీ అమ్మవారి ప్రతిమ అమర్చబడి ఉండుటవల్ల ఈ వాద్యమునకు "శారద" అని పేరువచ్చినది. ఈ వాయిద్యము వాయించువారిని శారదా వాళ్లు అని అంటారు. శారద కథ చెప్పవారు మామూలు ధోవతి, చొక్కా, కోటు ధరించి తలకు తలపాగాపెట్టుకొంటారు. వారి భార్యలే వారికి సహ కళాకారులుగా ఉంటారు. అందువలన వీరు ఒక్కరికన్నా ఎక్కువ స్త్రీలను పెళ్లాడెదరు. రాగాలాపనకు వంతప్రాముఖ్యత లేకుండా మామూలు ధోరణిలో కథకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చి వీరు శ్రావ్యంగా కథను చెప్పెదరు. వీరిలో శైవులు, వైష్ణవులు ఉన్నారుగానీ ఇరువురు ఐకమత్యంగా కథ చెప్పెదరు. వీరు ఎల్లమ్మ, మైసమ్మ, మాచమ్మ దేవతలను పూజించెదరు.

ముగ్గురు కళాకారులు చెబుతారు. వీరి వాద్యాలు వీణ, బుర్ర , తాణం బృందంలో సాధారణంగా ఆడమనిషి బుర్రను వాయిస్తూ ఉంటుంది. ఈ కథ చెప్పేవారు జంగాల కులస్థులు మరియు జంగాలలో ఒక శాఖ అయిన బడుగు జంగాలు. వీరు ఈ క్రింది కథలను చెప్పెదరు.

1. కాంభోజిరాజుకథ, 2. బలిచక్రవర్తి 3. సుగుణావతి కథ 4. సత్యహరిశ్చంద్రుని కథ, 5. ఆరుగురు మరాలీల కథ, 6. సర్వాయిపాపడు కథ మొదలయినవి.

పై కథలన్నీ ముఖత : తాత తరాలనించి వచ్చినవేకానీ గ్రంథస్థం కాబడలేదు. వీరిని వినాయకచవితి, దసరా పండుగలకు, ఉత్సవాలకి పిలుస్తారు. ప్రభుత్వ కార్యక్రమాలు కూడా చేస్తూ ఉంటారు. ఈ కార్యక్రమాలు లేని రోజులలో వ్యవసాయ కూలీపనులు చేసుకుంటూ ఉంటారు.

ఆంధ్రదేశంలో వరంగల్ జిల్లాలో 10 బృందాలు ఉన్నవి. ఈ కార్యక్రమాలపై రాబడి తక్కువ అగుటవల్ల క్రొత్తవారు నేర్చుకొనుటకు ఆసక్తి చూపుట లేదు.